క్లుప్తంగా

22 నుంచి ఆధార్ నమోదు శిబిరాలు ప్రారంభం

దెందులూరు: మండలంలో ప్రజలు ఈనెల 22 నుంచి 24 వరకు నాలుగు రోజులు పాటు నిర్వహించనున్న ఆధార్ నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు ఎంపీడీఓ కే శ్రీదేవి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ 22న సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలో, కొవ్వలి అంగన్‌వాడీ కేంద్రంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. 23న దెందులూరు బాలికల ఉన్నత పాఠశాలలో, కొవ్వలి ఉన్నత పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. 24న దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో, కొవ్వలి ఉన్నత పాఠశాలలో క్యాంపు నిర్వహిస్తామన్నారు. దెందులూరు 25న సచివాలయం -2లో శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

ఎఫ్‌ఏ-2 పరీక్షలు నవంబరుకు వాయిదా

నిడమర్రు: పాఠశాలల్లో ఈనెల 21 నుంచి నిర్వహించాల్సిన సెల్ఫ్ ఎస్సెస్‌మెంట్ మోడల్ పేపరు -2 (ఎఫ్‌ఏ-2) పరీక్షలు నవంబరు నెలకు వాయిదా పడినట్లు మండల విద్యాశాఖాధికారి పుచ్చల శేషు అన్నారు. ఈనెల 21నుంచి, 24 తేదీల్లో నిర్వహించాల్సిన ఈ పరీక్షలు నవంబరు 4 నుంచి 7వ తేదీకి వాయిదా పడినట్లు తెలిపారు. రోజుకి రెండు పరీక్షల చొప్పున నిర్వహిస్తారన్నారు. తుఫాన్ల కారణంగా కొన్ని జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో వర్కింగ్ డేస్ తగ్గి సిలబస్ కంప్లీట్ కాకపోవడం వంటి కారణాలతో ఈ పరీక్షలు వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన 1 నుంచి 10వ తరగతి వరకూ ప్రశ్నాపత్రాలను జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు పంపిణీ చేస్తామన్నారు.

గ్రాండ్ పేరెంట్స్‌కు క్రీడా పోటీలు



ఉప్పాకపాడులో కుర్చీల ఆట ఆడుతున్న గ్రాండ్ పేరెంట్స్

ఉంగుటూరు: ఉప్పాకపాడు పాఠశాలలో విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్‌కు క్రీడా పోటీలు శనివారం నిర్వహించారు. పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయుడు అల్లుశ్రీను ఆధ్వర్యంలో అమ్మమ్మ, నాన్నమ్మలకు కుర్చీలాట, అష్టాచెమ్మ, క్యారమ్స్ వంటి ఆటలు ఆడించారు. మ్యూజికల్ చైర్స్‌లో సీహెచ్‌లక్ష్మి, క్యారమ్స్‌లో దువ్వారపు దుర్గమ్మ, అష్టా చెమ్మలో వంబరిల్లి నాగమ్మ, పొంద్రంకి లక్ష్మి బహుమతులు గెలుచుకున్నారు. పొంద్రాకి కొండలరావు, అల్లు శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాస్టారు అల్లు శ్రీనుని నానమ్మ, అమ్మమ్మలు అభినందించారు.

బాణసంచా విక్రయం

పెదపాడు: డీసీఎంఎస్ ద్వారా నాణ్యమైన దీపావళి బాణ సంచా తక్కువ ధరకే విక్రయిస్తున్నట్టు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన బాణ సంచా విక్రయాల స్టాల్‌ను శనివారం చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదపాడు: నియోజకవర్గంలో రూ.20కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. శనివారం పెదపాడు మండలంలోని ఏపూరు కలపర్రులో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.1.8 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపూరు గ్రామంలో రూ.27లక్షల వ్యయంతో రహదార్లు, కలపర్రులో రూ.26లక్షల వ్యయంతో సీసీ రహదారి, కలపర్రులో రూ.55 లక్షల ఉపాధి హామీ నిధులతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల టీడీపీ అధ్యక్షుడు లావేటి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తా అనీల్, నాగేశ్వరరావు, తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపీడీవో అమీల్ జామా పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి గ్రామ సభ

దెందులూరు: రీ సర్వేలో గుర్తించిన భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ గ్రామ సభలు దోహదపడతాయని తహసీల్దార్ బి. సుమతి శనివారం అన్నారు. శనివారం చల్ల చింతలపూడి సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ అధ్యక్షతన దెందులూరు మండల సర్వేయర్ రమణారావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. చల్ల చింతలపూడి పంచాయతీ తిమ్మన్నగూడెంలోని రైతులు తమ సమస్యలపై అర్జీలను తహసీల్దార్‌కు అందజేశారు. గ్రామసభలో మండల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని, వీఆర్వో ప్రభాకర్‌రావు, రైతులు ఉన్నారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

ఉంగుటూరు: గోపాలపురం సచివాలయ పరిధిలోని పందిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు కైలా ఏడుకొండలు(54) శనివారం పిడుగు పడి మృతి చెందాడు. రోజూ మాదిరిగానే శనివారం ఏడుకొండలు పశువులతోపాటు పొలానికి వెళ్లగా అతడికి సమీపంలో హఠాత్తుగా పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో దాని ధాటికి మృతి చెందాడని స్థానికులు తెలిపారు.

కాలం చెల్లిన వంతెనలు.. కానరాని మోక్షం

- బ్రిటీష్ కాలం నాటి నిర్మాణాలు
- ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో ప్రమాదకరంగా వంతెనలు
- నూతన వంతెనలు నిర్మించాలని ప్రయాణికుల డిమాండ్



బ్రిటిష్ కాలంనాటి ఉంగుటూరు వంతెన



శిథిలావస్థలో ఉంగుటూరు వంతెన

ఉంగుటూరు: బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెనలకు కాలం చెల్లింది. వంతెనలు శిథిలమై ప్రమాదకరంగా మారాయి. ఏలూరు గోదావరి కాలువపై నిర్మించిన వంతెనలు సుమారు 8 దశాబ్దాలు దాటిపోవడంతో వాటి సామర్థ్యం తగ్గింది. కాలువలకు ఇరువైపులా గ్రామాలు ఆవిర్భవించడంతో ఆనాటి సామర్థ్యానికి, ఆనాటి అవసరాలకు అనుగుణంగా ఈ బ్రిడ్జిలు నిర్మించారు. నేడు ఆయా గ్రామాలు ఏలూరు కాలువకు ఇరువైపులా వృద్ధి చెందడంతో వాహనాల రద్దీ, ప్రయాణికుల రాకపోకలు పెరగడంతో బ్రిటిష్ కాలంనాటి వంతెనలు సరిపోవడం లేదు. ఉంగుటూరు, నారాయణపురం, కైకరం, పూళ్ల, గుండుగొలను, కొవ్వలి వద్ద 1930 ఆ దశకంలో వంతెనలు నిర్మించారు. పురాతనమైపోవడం, విపరీతమైన రద్దీ పెరిగిపోవడం, 20 టన్నుల సామర్థ్యం కలిగిన ధాన్యం, ఐస్, గ్రావెల్, ఇసుక లారీలు, తిరగటంతో వంతెలను బలహీనపడ్డాయి. ఈ కారణంగానే మూడేళ్ల క్రితం ఉంగుటూరు వంతెన కూలిపోయింది.ఆ సమయంలో కొత్త బ్రిడ్జి నిర్మిస్తారని అందరూ భావించినా రూ.35 లక్షల వ్యయంతో మరమ్మతులు మాత్రమే చేయించారు. తాత్కాలికంగా బెయిలీ బ్రిడ్జి నిర్మించి సుమారు రెండేళ్లపాటు వినియోగించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో పలు వంతెనల నిర్మాణం

గతేడాది గుండుగొలను బ్రిడ్జి కూలిపోయింది. అక్కడే నూతన వంతెన నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ దశలో ఉంది. ఈలోగా వాహనదారుల రాకపోకలకు బెయిలీ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. కైకరం, తల్లపురం, నాచుగుంట సత్యనారాయణపురం వద్ద కొత్త బ్రిడ్జిలు నిర్మించారు. ఇక మిగిలింది. ఉంగుటూరు, పూళ్ల ,నారాయణపురం వంతెలు ఇరుకుగా ఉండటంతో ఇక్కడ తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉంగుటూరు వంతెనపై ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నారు. టోలుప్లాజా పన్ను ఎగవేతదార్లు ఈబ్రిడ్జిపై నుంచి ప్రయాణించడంతో సమస్య మరింత జటిలమైంది. ట్రాఫిక్ రద్దీ కారణంగా పలు ప్రమాదాలు జరిగి ప్రయాణికులు, వాహనదారులు క్షతగాత్రులవుతున్నారు. నియోజకవర్గ, మండల కేంద్రమైన ఉంగుటూరుకు ప్రజలు వివిధ పనులపై రావడంతో వారికి ఈ వంతెనను దాటడం చాలా ఇబ్బందిగా మారింది. నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే సభలు, సమావేశాలకు ప్రజలు వస్తుంటారు. ఆ సమయంలో వంతెన వద్ద గంటల తరబడి కార్లు ఇరుక్కుపోతున్నాయి. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఉంగుటూరు, పూళ్లలో నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంచకర్మ వైద్యానికి పెరుగుతున్న ఆదరణ



ఉంగుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మాట్లాడుతున్న సర్పంచి బండారు సింధు, డాక్టర్ శిరీష

ఉంగుటూరు: పంచకర్మ వైద్యానికి పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో దానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెంచాలని ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సలహా కమిటీ సమావేశం అభిప్రాయపడింది. ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సలహా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కమిటీ అధ్యక్షురాలు, సర్పంచి బండారు సింధు మాట్లాడుతూ పంచకర్మ వైద్య నిర్వహణకు అవసరమైన నిపుణుల నియామకానికి కృషి చేయాలని అన్నారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని కోరారు. ఉపసర్పంచి పాతూరి జగదీష్, సభ్యులు చోడే శ్రీనివాస్, కాశి మంగన్న, తల్లాప్రగడ భీమేశ్వరరావు, సహాయకురాలు కృష్ణకుమారి, యోగా ఇన్‌స్ట్రక్టరు జయ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అట్లతద్ది పూజలు



గణపవరం: అట్లతద్ది పూజలో పాల్గొన్న మహిళలు



దెందులూరు: అట్లతద్ది సందర్భంగా అట్లు వేస్తున్న విద్యార్థులు

గణపవరం: మహిళలు ఎంతో పవిత్రంగా, భక్తిశ్రద్ధలతో ఆచరించే అట్లతద్ది పర్వదినాన్ని శనివారం మహిళలు ఎంతో వైభవంగా, ఉల్లాసంగా జరుపుకున్నారు. పెళ్లైన నూతన వధువులకు తొలిసారిగా వచ్చే అట్లతద్ది రోజున గౌరీపూజ, లక్ష్మీదేవి పూజలు నిర్వహించి, ఐదుగురు పేరంటాళ్లకు వాయినాలు ఇప్పిస్తారు. దీని వల్ల ఆ దంపతుల సంసారం సుఖంగా, సంతోషంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సాఫీగా సాగుతుందని మహిళల నమ్మకం. తద్దిరోజున తెల్లవారు జామున నూతన వధువుతో పాటు ఐదుగురు పేరంటాళ్లు గౌరీదేవికి పూజలు నిర్వహిస్తారు. చేతులకు గోరింటాకు పెట్టుకుని, నూతన వస్త్రాలు ధరించిన పేరంటాళ్లు నూతన వధువుతో లక్ష్మీపూజ, గౌరీదేవి వ్రతం చేయిస్తారు. తెల్లవారుజామునే భోజనాలుచేసి, సాయంత్రం గ్రామంలోని చెరువు వద్దకు మహిళలంతా వెళ్లి గౌరీదేవికి పూజ చేస్తారు. పేరంటాళ్లకు పదకొండు అట్లు, అరటిపండ్లు వాయినం అందిస్తారు. వీటితోపాటు కొత్తచీర, గాజులు, పసుపు, కుంకుమ వెండిగిన్నెలు తదితర వస్తువులను పేరంటాళ్లకు అందచేసి వారి ఆశీస్సులు పొందుతారు. మహిళలంతా గ్రామంలో ఒకచోటికి చేరి ఉయ్యాల ఊగుతూ ఆటపాటలతో గడుపుతారు. ఉభయ గోదావరి జిల్లాలో ఈ అట్లతద్ది పర్వదినం వైభవంగా జరుపుకుంటారు.

పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలు

దెందులూరు: పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రత్యేకలని, వాటిని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూక రాజు అన్నారు. శుక్రవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ జూనియర్ సీనియర్ విద్యార్థినులు అట్లతద్ది పండుగను నిర్వహించారు మామిడి చెట్లకు ఉయ్యాల కట్టి పాటలు పాడుకుంటూ ఊగారు. నర్సింగ్ విద్యార్థులు అట్లు వేసి వాటిని ఒకరికొకరు అందించుకున్నారు.

మద్యం వ్యాపారులపై కూటమి నాయకుల దందా

- నియోజకవర్గ ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే మద్యం షాపులు
- లాభాల్లో 30 శాతం వాటా ఇవ్వాలని హుకుం
- సిండికేట్ చక్రం తిప్పుతున్న జనసేన పక్షాన చేరిన టీడీపీ నాయకుడు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఉంగుటూరు నియోజకవర్గంలో మద్యం షాపు నడవాలంటే నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకోవాల్సిందే. ఇది ఒక ప్రైవేటు శాసనంగా అమలవుతోంది. లాటరీ ద్వారా ప్రభుత్వం విధానాలకు అనుగుణంగా మద్యం షాపులు మంజూరైనా ఇక్కడ వ్యాపారం చేయాలంటే నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధి, ఆయన ముఖ్య అనుచరుల అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మద్యం వ్యాపారంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు, స్థానిక నాయకుల జోక్యం అధికమైందని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. వ్యాపారులను బెదిరించి మరీ సిండికేటులో చేరాలని కూటమి నాయకులు ఆదేశిస్తున్నారు. ఈ విషయంలో నియోజకర్గ ప్రజాప్రతినిధి అనుచరుడు, జనసేన పక్షాన చేరిన టీడీపీ మండల నాయకుడు ఒకరు చక్రం తిప్పుతున్నారని తెలిసింది. ఉంగుటూరు మండలంలో 7 మద్యం దుకాణాలు వచ్చాయి. నియోజకవర్గం పరిధిలో 21 మద్యం షాపులకు అనుమతులు మంజూరయ్యాయి. లాభాల్లో 30 శాతం ఇవ్వాల్సిందేనని, లేకపోతే ఇబ్బందులు తప్పవని మద్యం షాపు దక్కించుకున్నవారిని కూటమి నాయకులు బెదిరిస్తున్నారు. ఇప్పటికే ఐదుగురు వ్యాపారులు కూటమి నాయకులతో వివాదం ఎందుకులే అని వారు చెప్పిన దానికి అంగీకరించినట్టు తెలిసింది. మరి కొందరు వ్యాపారులు తామెందుకు అంత శాతం వారికి ఇవ్వాలని అడ్డం తిరిగినట్లు సమాచారం. అంత మొత్తంలో ఎక్కడి నుంచి తెచ్చి ఇవ్వగలమని మద్యం షాపు యజమానులు తలలు పట్టుకుంటున్నారు. ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ సిబ్బందికి ముడుపులు చెల్లిస్తూ, స్థానిక రాజకీయ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు లాభాల్లోంచి 30శాతం ఇవ్వడం అసాధ్యమని మద్యం షాపులు దక్కించుకున్న వారు ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి, నిడమర్రు, గణపవరం, భీమడోలు మండలాల్లోనూ నెలకొంది. జనసేన, టీడీపీ నాయకులు దందా సాగిస్తూ నియోజకవర్గ ప్రజాప్రతినిధికి మేలు చేసేందుకు మద్యం వ్యాపారులను బలి చేస్తున్నారని సమాచారం. ఇప్పటికే బ్రాంది షాపులు దక్కించుకున్న వారిని బెదిరించడం, వారిని సిండికేటుకు రావాలంటూ హుకుం జారీ చేస్తూ ఒత్తిడి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నామినేటెడ్‌తోపాటు ముఖ్య పదవులు ఆశిస్తున్న కొందరు కూటమి నాయకులు నియోజకవర్గ ప్రజాప్రతినిధిని ప్రసన్నం చేసుకోవడానికి అత్యుత్సాహం చూపిస్తున్నారనే విమర్శలున్నాయి.

రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి సంతకాల సేకరణ

దెందులూరు: దెందులూరు రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జిని సాధిస్తామని 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్న స్వచ్ఛంద సేవకుడు ఓవర్ బ్రిడ్జి నిర్మాణ సాధన కమిటీ చైర్మన్ మద్దభూషణం అన్నారు. శనివారం దెందులూరు, పెదవేగి, ద్వారకాతిరుమల మండలాల్లో ప్రజాప్రతినిధుల నుంచి ఆమోద పత్రాలను తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మద్దభూషణం మాట్లాడుతూ మూడు రోజులుగా మూడు మండలాల్లో సంతకాల సేకరణ చేస్తున్నామన్నారు, రాష్ట్రంలో పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తులు ప్రయాణికులు దెందులూరు మీదుగా ద్వారకాతిరుమల వెళ్లడానికి రైల్వే గేటు వద్ద దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. దీంతో ప్రయాణికులు భీమడోలు మీదుగా వెళ్లాల్సి వస్తోందన్నారు. దీంతో అధిక సమయం, చార్జీల భారం అవుతోందని వేలాది మంది భక్తులు అభిప్రాయపడుతున్నారన్నారు. దెందులూరు రైల్వే గేటు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే వేలాదిమంది భక్తులు, ప్రయాణికులు, వ్యాపారులు, పాదచారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ అంశంపై అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు, విద్యార్థులు, మేధావులు మద్దతునిస్తున్నారన్నారు. ఇప్పటివరకు సేకరించిన సంతకాలు వినతిపత్రాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు అందజేసి ఆయన ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పారిశ్రామిక వేత్త కలపాల చంద్రశేఖర్ (బుజ్జి) మాట్లాడుతూ దెందులూరు రైల్వే గేట్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 15 ఏళ్లుగా సాధన కమిటీ చైర్మన్ మద్దభూషణం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఓవర్ బ్రిడ్జి సాధన ప్రక్రియ ముందుకు సాగేందుకు అవసరమైన సహాయసహకారాలు అందజేస్తామన్నారు. వంతెన నిర్మాణానికి మద్దతుగా ఆయన సంతకం చేశారు.

రెవెన్యూ సదస్సులో వినతులు

నిడమర్రు: భూ సమస్యలు పరిష్కరించేందుకు ఏపీ భూ రీసర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా గతంలో రీసర్వే పూర్తయినగ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం పెదనిండ్రకొలను గ్రామ సచివాలయం-1 వద్ద తహసీల్దారు ఎస్, నాగరాజు అధక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని నరసింహపురం రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన రీసర్వేకు రైతుల నుంచి వినతులను రెవెన్యూ సిబ్బంది స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి వినతులు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దారు నాగరాజు హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ కోడే కాశి, సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు, రఘు తదితరులున్నారు.

చోరీల నివారణ, భద్రతపై అవగాహన

ఏలూరు టౌన్: నేరాల నివారణకు సహకరించాలని సీసీఎస్ ఎస్సైలు బుద్దాల శ్రీనివాసరావు, ఏసీహెచ్ శేఖర్, కె.శ్రీధర్ ప్రజలను కోరారు. చోరీల నివారణ, భద్రతపై ఏలూరు అశోక్‌నగర్‌లోని రాజ్యలక్ష్మి అపార్ట్‌మెంట్స్‌లో అవగాహన కల్పించారు. డోర్ టూ డోర్ సెక్యూరిటీ ఆడిట్, లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టంను వివరించారు. అపార్ట్‌మెంట్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సీసీ టీవీ ఆన్‌లైన్ లింకులను పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం చేయటం ద్వారా నిత్యం పోలీస్ బృందాలు పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావటంతో నేరాలు పెరిగిపోయాయనీ, అదే సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను అడ్డుకోవచ్చని సూచించారు ప్రజలు ఎవరైనా ఇతర ప్రాంతాలకు వెళ్లే క్రమంలో సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా పోలీస్ సిబ్బంది పర్యవేక్షిస్తారని తెలిపారు.

క్రీడాకారులను దాతలు ప్రోత్సహించాలి



క్రీడాకారులకు బూట్లు అందజేస్తున్న సురేంద్రకుమార్

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులున్నారని, వీరికి తగినంత ప్రోత్సాహం అందిస్తే మంచి ఫలితాలను సాధిస్తారని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. గణపవరం డిగ్రీ కాలేజి నుంచి నన్నయ విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే అంతర విశ్వవిద్యాలయం స్థాయిలో నిర్వహించే కబడ్డీ పోటీలకు హాజరయ్యే జట్టు సభ్యులకు గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కె.సురేంద్రకుమార్‌రాజు రూ.15 వేల వ్యయంతో క్రీడాకారుల బూట్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల జట్టు కబడ్డీలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బూట్లు అందజేసిన సురేంద్రకుమార్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య, పీడీ స్వాతి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ జి.వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్డు వెంబడి చెత్త తొలగింపు



భీమడోలు జంక్షన్ నుంచి ఎం.నాగులపల్లి రోడ్డు వెంబడి ఉన్న చెత్తను తొలగిస్తున్న దృశ్యం



రహదారి వెంబడి చెత్త తొలగించి శుభ్రం చేసిన దృశ్యం

సాక్షి స్పందన

భీమడోలు: రహదారి చెంతనే చెత్త కుప్పలు శీర్షికన సాక్షిలో ఈనెల 8న ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. చెత్త చెదారాలను తొలగించే పనులను శనివారం చేపట్టారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పంచాయతీ కార్యదర్శి బాలమణి ఆధ్వర్యంలో జాతీయ రహదారి భీమడోలు జంక్షన్ నుంచి ఎం.నాగులపల్లి వరకు గల రోడ్డు వెంబడి ఉన్న చెత్తను తొలగించారు. భీమడోలు జంక్షన్‌లోని కొబ్బరి బొండాలు, ఇతర వ్యాపారులు చెత్త చెదారాలను ఎం.నాగులపల్లి రోడ్డు వెంబడి పారబోస్తున్నారు. దీనితో వర్షాలతో చెత్త తడిసి దుర్వాసన వ్యాపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్తను జేసీబీ సాయంతో తొలగించి ట్రాక్టర్లపై దూర ప్రాంతానికి తరలించారు. ఆ ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. రోడ్డు వెంబడి ఇష్టానుసారంగా చెత్త చెదారాలను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి బాలమణి హెచ్చరించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో రైతులు, మహిళలకు లబ్ధి



పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ విగ్రహానికి పూలమాల వేస్తున్న సిద్ధార్థ సింగ్, కామినేని

ఉంగుటూరు: కేంద్ర ప్రభుత్వం రైతులకు, మహిళలకు అనేక పథకాలు అమలు చేస్తు ఎంతో అండగా ఉంటోందని ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్ ఎమ్మెల్యే లాల్‌బహదూర్‌శాస్త్రి మనవుడు సిద్ధార్థ సింగ్ అన్నారు. శనివారం చేబ్రోలులో కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలపై లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సిద్ధార్థ సింగ్ మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చాక రైతులకు, డ్వాక్రా గ్రూపులకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. మాజీ మంత్రి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ పథకాలను వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమకిషోర్, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, మహిళా మోర్చారాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలాకిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపాటి సత్యనారాయణ, పార్లమెంటు కన్వీనర్ కృష్ణప్రసాదు పాల్గొన్నారు.

భూసంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలి



దుద్దేపూడిలో భూ సమస్యలను తహసీల్దార్ బి.రమాదేవికి వివరిస్తున్న రైతులు

భీమడోలు: భూ సర్వేలోని సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామసభలు దోహద పడతాయని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. జిల్లా జేసీ ధాత్రిరెడ్డి ఆదేశాల మేరకు దుద్దేపూడి సచివాలయం వద్ద శనివారం రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సభకు సర్పంచ్ నీలం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ భూ సర్వేలో ప్రతి రైతుకు సంబంధిత వివరాలను పొందుపర్చామన్నారు. భూమి విషయంలో విస్తీర్ణం, కొలతలు, ఇతర సమస్యలున్నట్లయితే లిఖితపూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిన్నింటిని పక్షం రోజుల్లో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం పలువురు రైతులు వినతులు, ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిరణకుమారి, మండల సర్వేయర్ ధర్మారావు, వీఆర్వోలు సోమయ్య, కందులపాటి శంకర్, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి చెరువు కలుషితం

గణపవరం: మండలంలోని వల్లూరులో మంచినీటి చెరువు కలుషితమవుతూ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ ముచ్చర్ల వేణు ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి చెరువు నుంచి మురుగునీరు తీసుకువెళ్లే మార్గాన్ని ఆక్వా చెరువుల యాజమాన్యం పూడ్చేయడంతో ఈ సమస్య ఏర్పడిందని ఆయన అన్నారు. ఈ విషయమై అధికారులకు ఆయన లేఖ రాశారు. మంచినీటి చెరువు దిగువ భాగంలో ఒక కుంటచెరువు ఉందని, గ్రామంలోని మురుగు నీరంతా ఆకుంట చెరువులోకి చేరుతుందన్నారు. కుంట చెరువు నుంచి మురుగునీరు తీసుకెళ్లే కాలువను చేర్చి రొయ్యల చెరువులు తవ్వడంతో ఆ కాలువ పూడుకుపోయి మురుగునీరు బయటకు వెళ్లకుండా మంచినీటి చెరువు సంపులోకి చేరుతోందన్నారు. తక్షణం సంబంధిత అధికారులు స్పందించి, మురుగునీరు బయటకు పోయే మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

కొట్లాటపై కేసు నమోదు

పెదవేగి : అన్యాయంగా ఓ వ్యక్తి దాడి చేసి తనను కొట్టాడంటూ గొల్లపల్లి ప్రసాద్ పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం నడిపల్లి ఆర్సీఎం చర్చి పక్కనగల గ్రౌండ్‌లో వాలీబాల్ మ్యాచ్ జరుగుతుండగా ఫిర్యాది గొల్లపల్లి ప్రసాద్ వెళ్లి స్కోర్ ఎంత అని అడగ్గా అతడిపై నడిపల్లి గ్రామానికి చెందిన పింగళి రవి దురుసుగా వ్యవహరించి దుర్భాషలాడుతూ అక్కడే ఉన్న ఎడ్ల బండి కర్రతో దాడి చేసి ఎడమ చేయి మణికట్టుపై బలంగా కొట్టాడు. దీంతో బలమైన గాయమైనట్టు ప్రసాద్ తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఫిర్యాది ప్రసాద్ స్టేట్‌మెంట్ ఆధారంగా ఎస్సై కె రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.